క్లుప్తంగా

దివ్యాంగునికి వితరణ



వితరణ అందిస్తున్న దాతలు

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామానికి చెందిన దివ్యాంగుడు టేకు శంకరరావుకు గ్రామస్తులు రూ.11,500 విరాళాలు సేకరించి అందించారు. రౌతు మురళి ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి ఆ మొత్తాన్ని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు చేతుల మీదుగా బాధిత కుటుంబానికి సోమవారం అందజేశారు. నిరుపేద కుటుంబానికి వితరణ అందించిన వారికి సంజీవనాయుడు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్.నారాయణరావు, డి.జగన్నాథం, ఎం.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రముఖులు, సభ్యులు

సాలూరు: 2022–23 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సాలూరు సాహితీ మిత్ర బృందం సభ్యులు, ప్రముఖులు బహుమతులు అందించారు. సాహితీమిత్ర బృందం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జర్జాపు ఈశ్వరరావు, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి తదితరులు పాల్గొని బహుమతులు అందించారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

వెంగాపురంలో గ్రామ దేవత ఉత్సవాలు



గ్రామంలో తిరుగుతున్న ఘటాలు

బలిజిపేట: మండలంలోని వెంగాపురం గ్రామ దేవత పెంటపోలమ్మ తల్లి ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి ఉయ్యాల కంబాల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం గ్రామ దేవత పండగ అనుపు ఉత్సవాన్ని నిర్వహిస్తామని పూజారి గోపినాయుడు తెలిపారు. గ్రామ సర్పంచ్ అమ్మడమ్మ, కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవం ప్రారంభం నుంచి గ్రామంలో ఘటాలు తిరగడం, భక్తులు వారి మొక్కులు తీర్చుకోవడం చేస్తున్నారు. మంగళవారం ఘటాలు తిరగడం, దివిటీల ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నారు.

చల్లంగా చూడమ్మా..!



పెంటపోలమ్మ తల్లిని దర్శించుకున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

బలిజిపేట: మండలంలోని వెంగాపురం పెంటపోలమ్మ తల్లిని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ సోమవారం దర్శించుకున్నారు. గ్రామంలో అమ్మవారి ఉత్సవాలు జరుగుతున్న సందర్భంగా అమ్మవారి గుడివద్దకు వచ్చి ఘటాలను దర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయవల్ల అందరూ చల్లగా ఉండాలని, దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో పూజారి గోపినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'సార్లంగి'

సీతంపేట: మండలంలోని సీది–సామరెల్లి గ్రామంలో గత 43 రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఫైనల్ పోరులో సార్లంగి, కొండవాడ జట్లు తలపడగా, సార్లంగి జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. విన్నర్‌కు రూ.30 వేల నగదు, రన్నరప్‌కు రూ.15 వేల నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో మన్యం ప్రగతి చైర్మన్ గేదెల రవి, మన్యం ప్రగతి అధ్యక్షుడు జి.జనార్దన్, బి.దమయంతి నాయుడు, ఎం.ఉమమహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

సీతంపేట: జీసీసీ(గిరిజన సహకార సంస్థ) సేవలు సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ డీఎం(డివిజనల్ మేనేజర్) సంధ్యారాణి కోరారు. సోమవారం మండలంలోని కె.గుమ్మడ గ్రామంలోని రేషన్ డిపోను సందర్శించిన ఆమె గ్రామాల్లోని గిరిజనులకు అవసరమైన నిత్యవసర సరుకులన్నీ జీసీసీలో అందుబాటులో ఉంచుతున్నామని, ఇక్కడే అందరూ కొనుగోలు చేసుకోవాలని తెలిపారు. బయట ఎవరూ వస్తువులు కొనుగోలు చేయవద్దన్నారు. కార్యక్రమంలో జీసీసీ మేనేజర్ దాసరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం మానసపుత్రిక వలంటీర్ వ్యవస్థ

- ఎమ్మెల్యే జోగారావు
- వలంటీర్లకు సత్కారం



మక్కువ: సేవా పురస్కారాలు పొందిన వలంటీర్లతో డిప్యూటీ సీఎం రాజన్నదొర, మావుడి సోదరులు

పార్వతీపురం టౌన్:

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మానసపుత్రిక వలంటీర్ వ్యవస్థ అని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో సోమవారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా కొత్తవలస ప్రాంతం పరిధిలో గల 5 వార్డు సచివాలయాలకు సంబంధించి 10 వార్డులలో విశేష సేవలు అందిస్తున్న 77 మంది వార్డు వలంటీర్లకు బైపాస్ రోడ్డు సి కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు నాయకుల చేతులు మీదుగా వలంటీర్లందరికీ సచివాలయాల వారిగా శాలువాలు కప్పి, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు విశేష సేవలు అందిస్తున్న గ్రామ/వార్డు వలంటీర్ల కృషికి గుర్తింపుగా స్వయానా ముఖ్యమంత్రితో గౌరవం పొందిన ఏకైక వ్యవస్థ వలంటీర్ వ్యవస్థ అని గుర్తు చేస్తూ వలంటీర్లందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. మీరంతా కూడా మునుముందు కూడా అన్ని సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజలకు అందచేసి ఈ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని తెలియచెప్పవలసిన బాధ్యత మీ అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు, చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కె.రుక్మిణి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె బాలకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ జి.మాధవరావు, వార్డు కౌన్సిలర్‌లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, వలంటీర్లు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

సీతానగరంలో..

ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా అందిస్తున్న వలంటీర్ల సేవలు చిరస్మరణీయంగా ఉండిపోతాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రశంసించారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సోమవారం సీతానగరం మండలంలోని నిడగల్లులో వివిధ గ్రామాల వలంటీర్లను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను ఎమ్మెల్యే జోగారావు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, వైస్ ఎంపీపీ టి సూర్యనారాయణ, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, సర్పంచ్ ఆరుద్రమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి. చిట్టిరాజు, పార్టీ మండల నాయకులు జి.శ్రీనివాసరావు, ఈశ్వరనారాయణ, ముకుందరావు, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్‌లు, గ్రామాల కన్వీనర్లు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

వలంటీర్లదే కీలక పాత్ర

మక్కువ: పేద, బడుగు బలహీన కుటుంబాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందించడంలో వలంటీర్లదే కీలక పాత్ర అని గిరిజన శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని మార్కొండపుట్టి గ్రామ సచివాలయంలో సోమవారం ఎంపీడీవో పి.దేవకుమార్ ఆధ్వర్యంలో సక్రమంగా సేవలందించిన గ్రామ వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం రాజన్నదొర, ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం రాజన్నదొర మాట్లాడుతూ మండలంలోని పనసభద్ర, సరాయివలస, మార్కొండపుట్టి సచివాలయాల పరిధిలోని ప్రజలకు మంచి సేవలు అందించినందుకుగాను ప్రభుత్వం గుర్తించి వలంటీర్లకు సేవా పురస్కారాలు అందించిందన్నారు. సంక్షేమ పథకాలు అందించడంలో ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా, నేరుగా ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో వలంటీర్ వ్యవస్థకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. వలంటీర్ వ్యవస్థ వల్ల ఎంతో మేలు కలుగుతోందన్నారు. అనంతరం వలంటీర్లను శాలువాలతో సత్కరించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



పార్వతీపురంటౌన్: సత్కరించిన వలంటీర్లతో ఎమ్మెల్యే జోగారావు



సీతానగరం: వలంటీర్ల సత్కార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

భాషా పండితుల పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలి

- ఐటీడీఏ పీఓకు వినతి



ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందజేస్తున్న సామల సింహాచలం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా ఐటీడీఏ పరిధిలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో ఉన్న తెలుగు, హిందీ భాషా పండితుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్ క్యాడర్‌గా ఉన్నతీకరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్‌కు ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం సోమవారం వినతిపత్రం అందజేశారు. విద్యా శాఖలో జిల్లా పరిషత్, ప్రభుత్వ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న తెలుగు, హిందీ భాషా పండితుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా గతంలోనే ఉన్నతీకరించారు. అయితే గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషా పండితుల పోస్టులను మాత్రం నేటి వరకు అప్‌గ్రేడ్ చేయకపోవడం వల్ల గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని ఐటీడీఏ పీఓకు వివరించినట్లు సామల తెలిపారు. ఈ సమస్యపై పీఓ ప్రత్యేకంగా చొరవ తీసుకుని భాషా పండితుల పోస్టులను అప్‌గ్రేడ్ చేయించేందుకు కృషి చేయాలని కోరినట్లు చెప్పారు. ఇందుకు పీఓ సానుకూలంగా స్పందించారన్నారు.

అమ్మవార్ల ఘటాలను దర్శించిన ఎమ్మెల్యే



ఘటాల ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: పురపాలక సంఘంలో కొలువైఉన్న గ్రామ దేవత ఉత్సవ మూర్తులు శ్రీ ఇప్పలపోలమ్మ తల్లి, బంగారమ్మతల్లి అమ్మవార్ల పండుగ ఈనెలాఖరులో నిర్వహించనున్న నేపథ్యంలో బెలగాం ప్రాంతం బూరాడ వీధిలో గల బంగారమ్మ తల్లి గుడి వద్ద అమ్మవార్ల ఘటాలు కొని తెచ్చే ఊరేగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొన్నారు. అమ్మవారి ఘటాలను ఈ సందర్భంగా దర్శించుకుని, పట్టణ ప్రజలంతా బాగుండాలని కోరుకున్నారు. ఈ ప్రాంతంలో బంగారమ్మ తల్లి ఘటాలు సోమవారం నుంచి ఈనెలాఖరు వరకు పురవీధుల్లో తిరగనున్నాయని ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు తెలియజేస్తూ అమ్మవారి పండగకు తప్పనిసరిగా రావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి ఆదినారాయణ, స్థానిక కౌన్సిలర్ చీకటి అనూరాధ, భాస్కరరావు, జిల్లా ఏపీ ఎన్‌జీఓ అధ్యక్షుడు కిశోర్ కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధనకే ప్రత్యేక తరగతులు



విద్యార్థుల పరీక్షలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ పి.వెంకటనాయుడు

సీతానగరం: ప్రభుత్వ గిరిజన విద్యాలయాల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయం ప్రిన్సిపాల్ పి.వెంకటనాయుడు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించినందున పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఉన్న పి కోనవలస, మల్లి విద్యాలయాల విద్యార్థులకు, జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక తరగతులకు 84 మంది హాజరవుతున్నారన్నారు. అలాగే జేఈఈ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ 2023లో నిర్వహించనున్న పరీక్షల్లో 14 మంది పాల్గొంటారన్నారు. జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయం నుంచి 9 మంది, మల్లి నుంచి నలుగురు విద్యార్థులు హాజరు కానున్నట్లు చెప్పారు.

బీటీ రోడ్డు నిర్మాణం ప్రారంభం



చాకరాపల్లి నుంచి అజ్జాడ వైపు నిర్మిస్తున్న బీటీ రోడ్డు

బలిజిపేట: మండలంలోని పి.చాకరాపల్లి నుంచి అజ్జాడ వరకు సుమారు నాలుగున్నర కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం జోరుగా సాగుతోంది. రూ.2.80 కోట్లతో నాలుగున్నర కిలోమీటర్ల రోడ్డు పనులు ఎమ్మెల్యే జోగారావు చొరవతో వేగవంతంగా సాగుతున్నాయని పి.చాకరాపల్లి సర్పంచ్ మోహనరావు తెలిపారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు రోడ్డు పనులను ఎమ్మెల్యే జోగారావు చేయిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. రోడ్డు నిర్మాణంతో గ్రామానికి పూర్తిస్థాయిలో రహదారి సౌకర్యం కలుగుతుందని విద్యార్థులు, ప్రయాణికులకు ఇబ్బందులు తొలగుతాయని గ్రామస్తులు చెప్పారు. ఎమ్మెల్యే జోగారావుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన సంక్షేమ విద్యాలయాల్లో బదిలీలు

- ఐటీడీఏ డీడీ సూర్యనారాయణ



సాలూరు: ప్రభుత్వ నిబంధనల మేరకు ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను నిబంధనల మేరకు బదిలీ చేస్తామని ఐటీడీఏ డీడీ సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొరను పట్టణంలోని ఆయన గృహంలో కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం విలేకరులతో డీడీ మాట్లాడుతూ, నాడు నేడు పనులు ప్రస్తుతం ఆశ్రమ పాఠశాలల భవనాలకు మాత్రమే వర్తింపజేశామని, హాస్టల్స్, డార్మిటరీలు, ఉపాధ్యాయుల గృహాలకు, కాంపౌండ్ వాల్స్‌కు వర్తించేలా చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

భామిని: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని కొత్తూరు ఐసీడీఎస్ పీఓ తులాల విమలారాణి సూచించారు. మండలంలోని బత్తిలి–1, 5, 6 అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం పరిశీలించిన ఆమె అక్కడి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇచ్చే పౌష్టికాహార పదార్థాలపై ఆరాతీశారు. గర్భిణులు రక్తహీనత బారినపడకుండా జాగ్రత్త వహించాలన్నారు. చిన్నారుల బరువుల రికార్డులు పరిశీలించి, పలు సూచనలు చేశారు.

మొక్కల పెంపకానికి మొదటి ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ భానుమూర్తి

బలిజిపేట: 2023–24ఆర్థిక సంవత్సరంలో మొక్కల పెంపకానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీఓ భానుమూర్తి సూచించారు. ఈ మేరకు బలిజిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసక్తికలిగిన అర్హులైన రైతులకు పథకంపై అవగాహన కల్పించి మొక్కలు అందించాలని సూచించారు. మెట్టు భూమి ఉండి ఖాళీగా ఉన్నట్లయితే ఆసక్తి కలిగిన రైతులతో మొక్కలు వేయించాలన్నారు. రైతుల వద్ద వన్ బి, జాబ్‌కార్డు వివరాలను క్షేత్ర సహాయకులు తీసుకుని కార్యాలయంలో అందించేలా చర్యలు చేపట్టి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. హార్టికల్చర్‌లో భాగంగా మామిడి, జీడి, సపోటా, కొబ్బరి, మునగ మొక్కలను పెంచేందుకు మెయింటనెన్స్ ఇవ్వనున్నట్లు రైతులకు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ కేశవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటా 'సంక్షేమ' వెలుగులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం:

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ వెలుగులు నెలకొన్నాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పనసనందివాడ గ్రామంలో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు వారి దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ఆయన పథకాలు అమలు చేస్తున్న తీరు దేశానికే ఆదర్శమన్నారు. ఆయన తన పాదయాత్ర, ప్రజాసంకల్పయాత్రలో చూసిన, విన్న ప్రజల కష్టాలను తీర్చేందుకు ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందజేయడంతో పాటు పథకాలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా అది జన్మభూమి కమిటీ సభ్యులు చెప్పిన వారికే దక్కేవన్నారు. ఇప్పుడు అలా లేదన్నారు. అర్హులైన వారు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే చాలని, దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజుల్లోనే పథకం మంజూరవుతోందన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేని చంద్రబాబు అండ్ కో సీఎం జగన్ సర్కారుపై లేనిపోని ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని, వాటిని ఎవరూ నమ్మడం లేదన్నారు. అన్ని వర్గాల ప్రజలు సీఎం జగన్ వెంటే ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి, సర్పంచ్ బొమ్మాళి సరోజిని, ఎంపీటీసీ సభ్యుడు బొత్స ప్రకాశరావు, పార్టీ నాయకులు కొరికాన గంగునాయుడు, సన్యాసినాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, శిష్టు మధుసూదనరావు, బొరోతు రాజశేఖరం, వావిలపల్లి పురుషోత్తమరావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక రూపంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలు దీవించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు సోమవారం బూర్జలో రెండవ రోజు వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ వి.నాగేశ్వరరావు, సర్పంచ్ జి దాసు, ఎంపీటీసీ జి చిన్నంనాయుడు, పీఏసీఎస్ చైర్మన్ టి సూరపునాయుడు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రతి ఇంటికివెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏవిధంగా అందుతున్నదీ, అర్హత కలిగినా ఇంతవరకూ ఎవరికైనా సంక్షేమ పథకాలు మంజూరు చెయ్యాలా? అని ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించడానికి, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అమలు చేయడానికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తెలుసుకుని పరిష్కరించడానికి కృతనిశ్చయంతో ఉందన్నారు. బూర్జ గ్రామానికి త్వరలో జల్‌జీవన్ మిషన్ పథకం నిధులతో ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు అవసరమైన నిధులు మంజూరు చేసినట్లు తెలియజేశారు. సంక్షేమ పథకాలతో లబ్ధి పొందుతున్న ప్రజలంతా సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఓట్లు రూపంలో దీవించి భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ పథకాలు పొందడానికి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి చిట్టిరాజు, పార్టీ మండల నాయకులు పి.ఈశ్వరనారాయణ,ఆర్వీ పార్థసారథి, బి.ముకుందరావు, ఎం.సూర్యారావు, ఉపసర్పంచ్ అల్లు శ్రీనివాసరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు, గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

'వలంటీర్లకు వందనం'

సీతంపేట: మండలంలోని దేవనాపురం గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బి.ఆదినారాయణ, జెడ్పీటీసీ ఎస్.లక్ష్మి ఉత్తమ వలంటీర్లను సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఇస్తున్న ఈ ప్రోత్సాహక సత్కారం భవిష్యత్‌లో మరింత బాధ్యతాయుతంగా పనిచేసేందుకు దోహదం చేస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధులుగా ఉన్న వలంటీర్లు చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందనినారు. మున్ముందు కూడా ఇదే స్ఫూర్తితో పనిచేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొండపల్లి సత్యం, గ్రామ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

భామిని: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో వలంటీర్లకు వందనం కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ తోట శాంతకుమారి, పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కార్యక్రమానికి హాజరై, ఉత్తమ వలంటీర్లను సన్మానిస్తారని పేర్కొన్నారు.

గిరిజన స్పందనకు 49 వినతులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమ వారం నిర్వహించిన గిరిజన స్పందన(జగనన్నకు చెబుదాం)కు మొత్తం 49 వినతులు వచ్చినట్లు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి తెలిపారు. వినతుల్లో తొత్తడి గ్రామానికి చెందిన ప్రసాదరావు గ్రామంలో విద్యుత్ స్తంభాలు మార్చాలని, గెద్దగూడకు చెందిన కృష్ణారావు తమ పిల్లలకు గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని, బిల్లమడకు చెందిన లక్ష్మి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలకు హద్దులు చూపించాలని, ఇదే ప్రాంతానికి చెందిన కన్నయ్య ఎన్ఆర్ఈజీఎస్‌లో వేసిన బోరు ఎవరో దొంగిలించారని, చర్యలు తీసు కోవాలని, సదరం సర్టిఫికెట్ ఇప్పించాలని ఎగువరుగడకు చెందిన నాగేశ్వరరావు, పెన్షన్ మంజూరు చేయాలని బందపల్లికి చెందిన చామంతి, కుట్టుమిషన్ ఇప్పించాలని కొండచొర్లంగికి చెందిన కుమారి కోరారన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ ఈఈ మురళి, ఎడ్యుకేషన్ ఓఎస్‌డీ యుగంధర్, సీడీపీఓ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.